# బియ్యం కథ

'గురువుగారూ రామరాజ్యం వచ్చేసిందిసార్'

'ఏమిటీ ఆనందం'

'బియ్యం రెండు రూపాయలకే దొరుకుతోంది'

'సంతోషం- బియ్యం చవకగా వస్తే- ఎంత ఆదా చేస్తావు బ్రదర్'

'మునుపు కిలో బియ్యం నాలుగైదు రూపాయలుండేది కదా? అందువల్ల వారానికి ఏభై రూపాయలైనా పొదుపు చేస్తా స్వామీ!- ఈ రోజు రెండు రూపాయల బియ్యం విందు చేస్తా! అంటూ గురవయ్య సంతోషంతో ఇంటికి చేరాడు. రాత్రి భార్య మల్లెపూలు పెట్టుకొని నవ్వుతూ స్వాగతం పలుకుతుందనుకుని గురవయ్య మురిసిపోయాడు. తీరా తలుపు తీశాక భార్య అగ్గినిప్పులా భగ్గుమంది!

'ఏమిటీ మూతి ముడుచుకు కూర్చున్నావు' గురవయ్య ప్రశ్నార్ధకరంగా నిలుచున్నాడు.

'చూడవయ్యా! బియ్యం తెచ్చావా! ఎంత నాసిరకమో చూడు! సగం రాళ్ళు, సగం బెడ్డలు, అక్కడక్కడ పురుగులు- అన్నీ పోను మిగిలిన బియ్యం ఎన్ని! పావుకిలో కూడా లేవు- ఇవి ఎవరు వండగలరు? ఎందరం తినగలం!! భార్య రుసరుసలాడింది.

"వో పనిచేద్దాం- బియ్యం పట్టుకెళ్ళి దుకాణదారుకు ఇచ్చేసి మంచి బియ్యం ఇమ్మందాం' అన్నాడు గురవయ్య.

'దుకాణదారుణ్ణి వచ్చి పట్టుకుపొమ్మని చెప్పండి' అంది భార్య గొప్ప సలహా ఇచ్చినట్టు.

'ఏమయ్యా ! మీ ఇంట్లో మీ ఆవిడ కలిపిందేమో బెడ్డలు, రాళ్ళు! కల్తీ అలవాట్లు మా వంశానలేదు' అన్నాడు దుకాణదారుడు.

చూడు నీ మీద పోలీసు కంప్లైయింట్ ఇస్తానన్నాడు గురవయ్య కోపంగా !

'ఇచ్చుకో ! అంటూ దుకాణదారుడు హాయిగా చుట్ట ముట్టించి పొగపీల్చసాగాడు.

గురవయ్య కోపంతో పోలేసుస్టేషన్‌కు వెళ్ళాడు.

'ఏమయ్యా ! ఏం జరిగింది' అన్నాడు పోలీసు ఇన్స్పెక్టర్.

సంగతి వివరించి చెప్పాడు గురవయ్య.

'వాడిపని పడతా, కంప్లైయింట్ రాసి ఇవ్వు' అన్నాడు ఇన్స్పెక్టర్.

గురవయ్య సంతోషానికి అవధుల్లేవు. పరపరా పోలీసువాళ్ళ కాగి తంమీదే కంప్లైయింట్ ఇచ్చేశాడు.

కంప్లైయింట్ తీసుకున్న పోలీసు కానిస్టేబుల్ చెయ్యిచాచాడు.

'ఇదేమిటి ?' అన్నాడు గురవయ్య.

ఏమయ్యా ఏమీ తెలీకుండా వున్నావు' అన్నాడు కానిస్టేబుల్.

బిత్తరపోయి గురవయ్య ఇన్స్పెక్టర్ వైపు చూశాడు.

'అది మామూలేనయ్యా అడిగింది ఇచ్చేయి' అన్నాడు ఇన్స్పెక్టర్.

తప్పనిసరిగా గురవయ్య పది రూపాయలు కంప్లైయింట్‌తోపాటు అందిచ్చాడు,

పోలీసు దుకాణదారుని కేకేశాడు. తిట్టాడు. లాఠీ పుచ్చుకుని అంగడి పెట్టెలమీద భయపెడుతూ తెగకొట్టాడు. 'పద లోపల బియ్యం ఎలా ఉన్నాయో చూస్తా' అన్నాడు పోలీసు.

గురవయ్య బైటే వున్నాడు.

పోలీసు దుకాణం లోపలికి వెళ్ళి నవ్వుతూ తిరిగివచ్చాడు.

'ఏమయ్యా ! బియ్యం అంతా మంచిగా వుంటే రాళ్ళు, బెడ్డలు అంటావేమిటి ? రాంగ్ కంప్లైయింట్స్ ఇస్తే జాగ్రత్త, బొక్కలో వేసేస్తా' అన్నాడు పోలీసు. గురవయ్య బెదిరిపోయాడు.

బియ్యం కోసం కటకటాల మధ్యకా? అని బాధపడుతూ ఇంటికి వెళ్ళాడు గురవయ్య. భార్యకు కథ చెపితె విషాదంగా ముఖం పెట్టుకూర్చుంది.

'వంట చేశావా?' అని అడిగాడు గురవయ్య.

'వంటా? ఏంపెట్టి చేయాలి కిరసనాయిలు స్టాకులేదట'

'ఈ రాత్రి కిరసనాయిలు నేనెక్కడ తేగలనే' అన్నాడు గురవయ్య.

'బ్లాకులో కొందామంటే చేతిలో పైసా లేదు' అంది భార్య.

'రేపు కిరసనాయిలు దొరుకుతే వండిపెట్టాలి. ఉన్న కట్టెలు రెండూకూడా బూడిదయ్యాయి' భార్య విచారంగా కూర్చుంది. మెల్లిగా నసిగింది. 'చంటాడికి జ్వరం వచ్చింది' గురవయ్య తలమీద పిడుగు పడ్డట్టయ్యింది.

'మందు తీసుకురావా' అంది భార్య.

'పది రూపాయలు లేందే మందు డాక్టరిస్తాడా? ఇంతకీ జ్వరం ఎందుకొచ్చిందే' అరిచాడు గురవయ్య.

'ఏముంది నీళ్ళు! మడ్డినీళ్ళు కుళాయిల్లో వస్తున్నాయి. అవి తాగుతే ఏమౌతుంది నీకూ నాకూ కూడా జ్వరం వస్తుంది" అంది భార్య మూతి తిప్పుకుంటూ.

'డాక్టర్‌కు ఈ పది రూపాయలు ఇచ్చేస్తే అంతా ఖాళీ' గురవయ్య గుర్రుమన్నాడు.

'ఏభై రూపాయలు ఆదా అయిందనుకున్నా ఈ బియ్యంవల్ల! ఇదేమిటీ అంతా ఖర్చయిపోయింది. చివరకు నాకే అన్నం లేదు' అనుకున్నాడు గురవయ్య. పిల్లాడికీ మందేసి. గురవయ్య, భార్య ఒకరినొకరు చూసుకున్నారు. విషాదంగా కన్నీరు తుడుచుకుంటూ ఒకరినొకరు కౌగిలించుకున్నారు కన్నీటి చుక్కలు రాలుస్తూ రెండు గ్లాసుల మంచినీరు తాగి ఒకరిఒడిలో ఒకరు పడుకున్నారు.

"ఇదయ్యా పేదవాడి బియ్యం కథ" అన్నాడు గురువుగారు శిష్యుడితో.

♦ ♦